[15]

# మనసు బాగులేదు

తెల్లవారింది. అయినా చలికాలం ఇంకా పూర్తిగా పోలేదు. కిటికీలో నుంచి చల్లటిగాలి వీస్తోంది. చలిఎక్కువగా ఉంది.

సుందరానికి మెలుకువ వచ్చింది. అయినా ఇంకా లేవాలనిపించలేదు. చలికి కంబళి నిండా కప్పుకు పడుకున్నాడు.

"ఏమిటో, ఇవ్వాళ మనస్సు బాగుండలేదు" అనుకున్నాడు. ప్రతిరోజు ఈ భావంతోటే ప్రారంభమౌతుంది. ఆ మాట అనుకుంటూనే రోజు గడిచి పోతుంది. పక్కమీద నుంచి లేచి కొత్తగా వచ్చిన పగటిని చూడటానికి, ప్రతిరోజూ దిగజారిపోతున్న మనస్సుకు ధైర్యం చెప్పుకోవాలి.

నౌకరు మాధవుడు టీ తెచ్చాడు; సుందర్‌ను లేపాడు. అతను విసుగుతో "అక్కడ పెట్టిపో" అన్నాడు. మాధవుడు సులభంగా వదలడు. "లేవండి బాబూ, ఆరవుతోంది" అంటూ వెళ్ళిపోయాడు.

ఇంక అతనికి లేవక తప్పలేదు. ఆవలిస్తూ లేచి టీ త్రాగడం ప్రారంభించాడు.

స్నానం చేసి పత్రిక చూస్తూ కూర్చున్నాడు. కాని మనస్సు అందులో లేదు. ఎక్కడెక్కడో తిరుగుతోంది. అలా అలా తొమ్మిదయింది.

పక్కింట్లో రేడియో ప్రారంభమైంది. ఏదో పాత పాట వినిపిస్తోంది. "తేరీ దునియా మే దిల్ లగతానహీ." సుందర్ ముఖం వాడిపోయింది. ఈ పాట ప్రారంభమైందంటే ఇల్లు వదలి వెళ్ళడానికి సమయమైందన్న మాట. మళ్ళా రాత్రి పదిగంటలకే ఆపాట ఆగేది అంతసేపు దాన్ని భరించడం కష్టం.

అతడు వెంటనే మేడదిగి కిందికి వచ్చాడు. బయటికి వెళ్ళాలంటే తండ్రి గది దాటి వెళ్ళాలి. అక్కడకు రాగానే అతనికి అడుగులు తడబడ్డాయి. గుండెలు కొట్టుకున్నాయి. అతన్ని చూడగానే తండ్రిపిలిచి మామూలు ప్రశ్నలు వేస్తాడు. అవి తప్పించుకున్న తరువాత బయటికి అడుగు పెట్టగలడు.

"ఎక్కడికి వెళ్ళుతున్నావ్ ?"

"ఉద్యోగం సంగతి ఏ మాలోచించావ్. బ్యాంకులో ఏదో ఖాళీ ఉందట. రైల్వేలోకూడా దొరక వచ్చుట, హను మాన్లుగారన్నారు ప్రయత్నిస్తామని, ఏమంటావు?"

ఆ తరువాత మరొక ప్రశ్న. "పెళ్ళి ఎప్పుడు చేసుకుం టావు? మామయ్య రోజూ అడుగుతున్నాడు. ఏం చెప్ప మంటావు?"

ఇది ఇవ్వాళ కొత్తకాదు. నాలుగేళ్ళగా తండ్రి ఈ ప్రశ్నలు అడుగుతూనే ఉన్నాడు. అతను "ఆ, ఊ" అంటూ తప్పించుకుంటూనే ఉన్నాడు. అల్లాగే రోజులు దొర్లిపోతు న్నాయి.

నాలుగేళ్ళ క్రిందట తనుచదువు ముగించుకొని రాగానే ఈ ప్రశ్నలు ప్రారంభమైనాయి. "ఇప్పుడేం చేస్తావు? ఏమన్నా ఆలోచించావా ?" అన్నాడు తండ్రి తన్ను చూడగానే. ఆ మాటలకు అతను అదరి పడ్డాడు. అంతవరకూ ఏంచెయ్యాలి అన్న ప్రశ్న తోచలేదు. ఒక సంవత్సరం చదువు పూర్తికాగానే ఏ దైనా చెయ్యాల్సి ఉంటుందని ఎప్పుడూ ఆలోచించ లేదు. తండ్రిప్రశ్న అతన్ని కలవరపెట్టింది. కొన్నాళ్ళకు తండ్రి ఇంకొక ప్రశ్నకూడా అడుగుతూ వచ్చాడు. "పెళ్ళి ఎప్పుడు చేసుకుంటావు ? సరళను చేసుకుంటామని మామయ్యకు ఇది వరకే మాట ఇచ్చాంగదా?" అని.

పెళ్ళిమాట వినగానే అతని మనస్సు కలత చెందుతుంది. సుశీల గుర్తుకు వస్తుంది. ఆమె అమాయకమైన, దీనమైన కళ్ళు గుర్తుకు వస్తాయి. ఆమెను వివాహం చేసుకోవాలన్న కోరిక ఇంకా నశించి పోలేదు.

కాలేజీలో ఆమె తనకంటె తక్కువ క్లాసులోచదువుతూ ఉండేది. ఒక రోజు అనుకోకుండా ఆమెను లైబ్రరీలో చూచాడు. ఆమె ఒకమూల చదువుకుంటోంది. తానూ ఆ బల్లదగ్గరే వెళ్ళి కూర్చున్నాడు. పక్కన కిటికీలోంచి సముద్రపు హోరు వినిపిస్తోంది. ఆమె తలెత్తి తీక్షణంగా అతని కేసి ఒకసారి చూసింది. మళ్లా తలవంచుకొంది. అంతే! ఆ చూపు శాశ్వతంగా అతని హృదయంలోకి చొచ్చుకు పోయింది. ఆ నిమిషం నుంచి అతనికి ఆమె ధ్యాస పోలేదు.

ఆమె అందమైనది కాదు. ఆమె కట్టుకునే చీరలు ఆమె బీదరికాన్ని, దైన్యాన్ని ప్రస్ఫుటం చేస్తాయి. అయితే ఆమె సూదుల్లాంటి కళ్ళల్లో ఏదో తీక్షణత, అభిమానం, ధైర్యం వ్యక్తమవుతూ ఉంటాయి. ఆమె స్వభావమంతా ఆ కళ్ళల్లోనే ఇమిడి ఉన్నట్లుంటుంది.

ఆమెను చూచిన క్షణంనుంచి అతను కాలేజీలో ఆమెను వెన్నంటి తిరగడం నేర్చుకున్నాడు. ఆమెను చూసే కొద్దీ అతనికి ఆమె ఆకర్షణ ఎక్కువైంది. ఇంచుమించు మతి పోయినట్లయింది. ఇతని గొడవ భరించలేక విసుగెత్తి ఆమె ఒకరోజు ధైర్యంగా అడిగింది:

"మీరెందుకిలా నా వెంట పడ్తారు. మీకేం కావాలి?" అని. అతనికి ఏం చెప్పాలో తోచలేదు. కంగారు పడి ఇంచుమించు మొరటుగా చెప్పాడు.

"నాకు మీరు కావాలి" అని.

ఆమెకు కోపం వచ్చింది. కోపంతో, బాధతో ఆమెకు కళ్ళు చెమ్మగిల్లాయి. "మీరు అందంగా ఉన్నారు. ధనవంతులు కూడా కావచ్చు. నేను దరిద్రురాల్ని. అందవికారమైన దాన్ని కావచ్చు. అయినా నన్ను అవమానించడానికి, పరిహాసం చెయ్యడానికి మీ కేమధికార మున్నది" అన్నది రోషంతో.

అతనికి విపరీతమైన దుఃఖం ముంచుకు వచ్చింది. అతను ఎన్నో చెప్పాలనుకున్నాడు. "నాకు డబ్బు కోసంగాని, రూపం కోసంగాని, వ్యామోహం లేదు. మీలో ఏదో నన్ను విపరీ

తంగా ఆకర్షిస్తోంది. నేను నిజమే చెబుతున్నాను. మిమ్మల్ని పరిహాసం చేయడం లేదు" అని. కాని అతను పెదవి కదపక ముందే ఆమె వెళ్ళిపోయింది.

నాలుగు రోజుల తరువాత ఆమె మళ్ళా కనిపించింది. అతను మేడ మెట్లు దిగుతున్నాడు. ఆమె పైకెక్కి వస్తోంది. అక్కడ ఇంకెవరూ లేరు. అతను ఈ సారి ధైర్యం తెచ్చుకుని ఆమెకు దగ్గరగా వెళ్ళి అన్నాడు: "మీరెప్పుడూ నన్ను ప్రేమించలేరా? నన్ను నమ్మలేరా?" అని.

ఆమె రోషంతో వణకిపోయింది. తిరస్కార భావంతో వ్యంగ్యంగా అన్నది: "పాపం మీకు ఆడపిల్లలతో ఆడుకోడం, పరిహాసం చేయడంతప్ప వేరే పనేమీ లేనట్లున్నది. నాకు చాలా పనులున్నాయి. నేను చదువుకోవాలి, ఉద్యోగం చెయ్యాలి. మా అమ్మను, తమ్ముడిని పోషించుకోవాలి." విసుగ్గా కోపంగా ఆమె వెళ్లిపోయింది. దుఃఖం, నిరాశ ముంచుకు రాగా దిక్కుతోచక అతను ఊరుకున్నాడు.

వారం రోజులు అయ్యాక ఆమె కాలేజీకి రావడం మానేసింది. రోజూ అతనికి ఆమెకోసం ఎదురు చూసి చూసి విసుగెత్తింది. భరించలేక ఆఖరుకు అందర్నీ ఆవిడను గురించి అడగడం ప్రారంభించాడు. ఎవరికీ ఏమైందో సరిగా తెలియదు. డబ్బులేక చదువు మానేసిందని, ఎక్కడో ఏదో ఉద్యోగం దొరికి వెళ్ళిపోయిందని రకరకాలుగా చెప్పారు.

అతని హృదయంలో భరించలేని వేదన చోటు చేసుకున్నది. ఆమె దూరమైన తరువాత ఆమె తన హృదయంలో ఎంతగా నిండుకొన్నదో ఇంకా ప్రస్ఫుటంగా వ్యక్తమైంది. తను ఆమెను వివాహం చేసుకోవాలనుకున్నాడు. ఆమెకు సహాయం చెయ్యాలనుకున్నాడు. కాని ఆమెను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నట్లు కూడా ఆమెకు నమ్మకం కలిగేటట్లు చెప్పలేకపోయినాడు. తనేదో ఆమెను పరిహాసం చేస్తున్నట్లు, అవమానిస్తున్నట్లు అపోహపడి ఆమె తనకు దూరంగా తొలగిపోయింది. అది అతనికి తీరని వ్యథ అయింది.

ఎలాగో తండ్రి గది దాటి బయటపడ్డాడు. నీలంవీధి వేపు వెళ్ళాడు. అక్కడా మళ్ళా రేడియోలో అదే పాట వినిపిస్తోంది. "తేరీ దునియామే దిల్ లగతా నహీ"

సుందర్ మళ్ళా తనలో "మనస్సు బాగులేదు" అనుకున్నాడు. మనస్సు బాగులేదు అంటే అర్థమేమిటో? ఎందుకు బాగుండదు? బాగుండకపోవటానికి కారణమేమిటి? సుశీల తనను ఆదరించివుంటే బాగుండేదా? ఏమో! ఆ పరిస్థితి ఇప్పుడు లేదు. ఎలా చెప్పగలడు! అప్పుడింకేదైనా కారణంచేత బాగుండేది కాదేమో!

నీలంవీధి సందు తిరగగానే అతని గుండెలు కొట్టుకున్నాయి. అక్కడే హనుమాన్లుగారిల్లుంది. ఎవరైనా చూస్తే లోపలికి వెళ్ళక తప్పదు. అతడు బెదురుతూ అడుగు ముందుకు వేస్తూనే ఉన్నాడు. వెనుకనించి అప్పుడే శ్యామల పిలుస్తూనే ఉంది "సుందరంగారూ" అని.

ఇంక లాభంలేక అతను వెనక్కు తిరిగి వెళ్ళాడు. హనుమాన్లుగారు అతని తండ్రికి ప్రియమైన స్నేహితుడు. ఆయనకు నలుగురు కూతుళ్ళు. ఇద్దరుఉద్యోగాలు చేస్తున్నారు. ఇద్దరు చదువు కుంటున్నారు. ఈ నలుగురికీ పెళ్ళిళ్ళు ఎలా అవుతాయన్నది ఆయనకు పెద్ద సమస్య. వీళ్ళలో ఎవరినైనా సుందర్ చేసుకుంటాడేమోనని ఆయన ఆశ. అందుకే అక్కడికి వెళ్ళడమంటేనే అతనికి భయం.

ఆ వేళ హనుమాన్లుగారు ముందర గదిలో పేపరు చదువుకుంటున్నారు. సుందర్‌ను చూడగానే అడిగారు. "ఉద్యోగం సంగతి మీ నాన్నతో చెప్పాను. రైల్వేలో కావలిస్తే సులభంగా రావచ్చు. మా బంధువొకాయన రైల్వేలో పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు" అన్నారు.

సుందర్ ముభావంగా "చూద్దాంలెండి" అన్నాడు. మనస్సులో మాత్రం విసుక్కున్నాడు. అందరికీ తన గొడవే ఎందుకు పట్టింది? తన ఖర్మానికి తనను వదలివేయకూడదా? ఒక్కసారి గట్టిగా అరచి అందరితో చెపితే బాగుండును. "నాకు ఉద్యోగం అక్కరలేదు. వివాహం అక్కరలేదు. నేనిలాగే వ్యర్థంగా బ్రతక దలచుచున్నాను" అని. కాని ఎవరితోను మనసులోని మాటలు చెప్పలేడు. మర్యాద అడ్డొస్తుంది. మనోభావాలన్నీ మనసులోనే అణచుకోవాలి.

లోకందృష్టిలో తను వ్యర్థమైన బ్రతుకు బ్రతుకుతున్నాడు. ఉద్యోగము, వివాహము, సంసారము, హోదా,

చివరకు నెరిసిన జుట్టు, బట్టతల, అర్థంలేని నవ్వు - అది క్రమ బద్ధమైన జీవితము! అది వ్యర్థం కాదు కాబోలు!

హనుమాన్లుగారి కుమార్తెలు శ్యామల, ఊర్మిళ, వనజ, కలహంస, అందరూ ఒక్కసారివచ్చి చుట్టుకున్నారు. ప్రశ్నల వర్షం కురిపించారు.

"కళ్యాణి పత్రికలో మీ కథ పడిందే! ఎంత బాగుందనుకున్నారు!"

"ఆ కథలో అమ్మాయి ఎవరండీ? అంతగా మీ మనస్సును ఆకర్షించినది. ఆమెను చూడాలని ఉంది."

"మీ రీ పూట ఇక్కడ ఉండి భోంచేసి వెళ్ళ గూడదూ?"

ఈ ప్రశ్నలు, మర్యాదలు తట్టుకుని మెల్లిగా తప్పించుకుని బయట బడేటప్పటికి ముచ్చెమటలు పోశాయి. అప్పటికి పదకొండు దాటింది. ఆకాశం మబ్బుపట్టి వర్షం వస్తుందేమో ననిపిస్తోంది. చల్లటి గాలి వీస్తోంది.

అతను మెల్లిగా సముద్రం వేపు నడచి వెళ్ళాడు. తుపాను ముందర ఉప్పొంగినట్లుగా సముద్రం పెద్ద పెద్ద కెరటాలతో భయం కలిగిస్తోంది. ఒక్కొక్క అల ఆకాశమంత ఎత్తున లేచి, భయంకరంగా ఒడ్డున విరుచుకు పడుతోంది. ఆ దృశ్యం సముద్రం ఏదో విరక్తి చెంది ప్రళయావేశంతో ప్రపంచాన్ని మ్రింగటానికి ప్రయత్నిస్తున్నట్లుంది.

సముద్రం ఒడ్డునే చాల దూరం నడచి వెళ్ళాడు. ఆలోచనల్లో మునిగిపోయి ఎంతదూరం వచ్చిందీ కూడా తెలియ

లేదు. ఆకలితో దప్పితో అలసట చెందాడు. అయినా అది తెలియలేదు. మనస్సులో ఉండి ఉండి ఒకే భావాలు మెదులుతున్నాయి.

నాకు ఏ నిమిషమూ మనస్సెందుకు బాగుండదు? ఎందులోను ఆసక్తి ఎందుకు ఉండదూ? ఈ అశాంతికి, వ్యధకు కారణ మేమిటి? అంతా సుశీలకోసమా? ఆమెను పొందగలిగి ఉంటే సుఖమూ, శాంతీ లభించేవా? ఈ ప్రపంచంలో ప్రతి వస్తువు జడంగా నీరసంగా ఎందుకు ఉంటుంది? ఎందులోనూ సంతోషం ఎందుకు ఉండదు? ఈ వ్యాకులత ఎప్పుడు ఎలా తొలగుతుంది?

ఈ ప్రశ్నలకు సమాధానాలు లేవు. అతనికనుకొలకుల్లో కన్నీటి బిందువులు కదలి మాయమైనవి. అలసటతో అతను తిరిగి ఇంటిముఖం పట్టాడు.

ఎవరిదో తెల్లని అందమైన కుక్కపిల్ల ఎంతో దూరం నించి అతన్ని అనుసరించి వస్తోంది. ఏవో ఆలోచనల్లో మునిగిన అతను ఇంతవరకు దాన్ని చూడనేలేదు. అతను వెనక్కు తిరగగానే అదీ వెనక్కు తిరిగింది. అప్పుడు చూచాడు.

ఎవరిదో తప్పిపోయిన కుక్కపిల్ల కాబోలు! తన యజమానిని వెతుక్కుంటోందేమో ?

అతనికి జాలివేసింది. అయినా దాన్ని ఎలాగైనా వదల్చుకోవాలనిపించింది. దాన్ని దూరంగా తరిమాడు. అది పోలేదు. భయంగా, దీనంగా చూస్తూ ఊరుకుంది. ఎక్కడా

దిక్కుతోచక అది తనను ఆశ్రయించి నట్లున్నది. ప్రతిప్రాణి ప్రేమకోసం ఆదరణకోసం పరితపిస్తుంటుంది కాబోలు !

ఈ ఆలోచనతో అతని మనస్సు ఆక్షణంలో మారింది. "ఎంతసేపూ నన్ను గురించే ఆలోచిస్తూ మనస్సు పాడుచేసుకుంటున్నాను. అంతకన్నా మరొకరికి ఒక్కక్షణమైనా నా మూలానే ఆనందం కలిగితే ఎంతబాగుంటుంది! ఎవరి మనస్సూ నొప్పించకుండా ప్రేమా, ఆదరణా చూపగలిగితే ఎంతబాగుంటుంది! అలాగే నాదిగులూ దూరం కావచ్చు" అనుకున్నాడు.

ఆ కుక్క పిల్లను తానుఇంటికి తీసుకువెళ్ళితే బాగుండుననిపించింది. ఆప్యాయంగా దానితో ఆడుకుంటూ కొంత దూరం నడిచాడు. కాస్సేపటికి దూరాన తన యజమానిని చూచి అది పారిపోయింది. అతనికి దిగులనిపించింది. నిరుత్సాహం కలిగింది. ఎక్కడా ఏ సంబంధమూ లేని ప్రాణులకు క్షణికాను బంధాలు ఎందుకు ఏర్పడతాయి ? క్షణిక సంయోగం, క్షణిక వియోగంతోనే ఆనందమూ నిరాశ ఎందుకు కలముకొంటాయి ?

సముద్రపు ఒడ్డుదాటి ఇంటితోవ పట్టాడు. అప్పటికి సాయంత్రమైంది. తోవలో అతనికి సరళను ఒకసారిచూస్తే బాగుండుననిపించింది. ఆమె అతనిని ఎంతగానో ప్రేమిస్తున్నది. చిన్నప్పుడు తోటలో పూలు దోసిలినిండా నింపుకొని తనకందిచ్చేది. ఈ జ్ఞాపకంతో అతను మేనమామ ఇంటికి వెళ్ళాడు. అతను ఇంట్లో అడుగు పెట్టగానే వర్షంజోరుగాపట్టు

కుంది. మండువాలో అతని అమ్మమ్మ కూర్చుని వత్తులు చేసు కుంటోంది. "ఏం నాయనా, బొత్తుగా రావడమే మానే శావు" అన్నది. అతను ఆమె దగ్గరగా కూర్చున్నాడు.

"ఏమిటో, అమ్మమ్మా మనస్సు బాగుండడు. ఎక్కడికీ వెళ్లాలని ఉండదు." అన్నాడు.

కాస్సేపటికి ధైర్యంచేసి అడిగాడు. "సరళఏదీ" అని.

"మేడమీద ఉంది. వెడతావా ?" అన్నది ఆమె ఆశగా.

అతను పైకి వెళ్లాడు. సరళ ముందర వరండాలో నిల్చొని జోరుగా పడుతూన్న వాన చుక్కలు చూస్తోంది. సుందర్‌ను చూసి ఆమె కంగారు పడింది. కంటతడి పెట్టుకుంది.

అతని మనస్సు చెదిరింది, "ఎందుకీ కన్నీరు? నేను రాలేదనా?" అన్నాడు. ఆమె జడివానలా రాదలచిన కన్నీ టిని ఆపుకుని చెప్పింది దీనంగా! "నువ్వు ఎన్నాళ్ళకూ, ఏమీ చెప్పడం లేదని, నాన్న వేరే సంబంధాలు చూస్తున్నాడు."

అతని మనస్సు జాలితో నిండింది. తనకు ఏ సుఖమూ లేనే లేదు. ఈ పిల్ల మనస్సు నెందుకు తాను గాయపరచాలి? తాను ఆమెకు సుఖాన్ని, సంతోషాన్ని ఇవ్వగలడు. ఆలో చించుకోకుండా వెంటనే అన్నాడు. "నేను రేపే చెబుతాను, నాన్నతో, మామయ్యతో. నిన్ను తప్పక చేసుకుంటానని, ముహూర్తం పెట్టించమని" అని.

ఆమె ముఖం చంద్రోదయానికి వికసించిన కలువ పువ్వులా మెరసింది. సిగ్గుతో గబగబా మేడ దిగిపోయింది.

వర్షం కొంచెం తగ్గింది. అతను వెళ్ళిపోయాడు. ఇల్లు చేరేటప్పటికి రాత్రి ఎనిమిదై ఉంటుంది. ఇంట్లో అడుగుపెట్ట గానే మాధవుడు వార్త తెచ్చాడు. "మీ చెల్లెలు సరస్వతి వచ్చింది" అని.

సరస్వతి అతనికి పిన్నికూతురు. అతని వయస్సే ఉంటుంది. చిన్నప్పుడు కలిసి ఆడుకునే వాళ్ళు. ఆమె పెళ్ళయిన తరువాత మళ్ళా కలుసుకోలేదు. మాధవుడు మళ్ళా చెప్పాడు: "సాయంత్రం వచ్చింది. వంట ఇంట్లో పిల్లల కన్నాలు పెడుతోంది" అని.

అతను లోపలికి వెళ్ళాడు. పిల్లలను చుట్టూ కూర్చొ పెట్టుకుని సరస్వతి వాళ్ళ కన్నాలు పెడుతోంది. పిల్లలందరూ ఒకేసారి గోలగా అరుస్తున్నారు. ఆ అరుపులతో ఆమె అలసి పోయినట్లుంది. ఆమెను చూడగానే అతనికి జాలి ముంచు కొచ్చింది. ఆమె తనుఎరిగిన సరస్వతికాదు. తనతో ఆడుకున్న సరస్వతి కాదు. వాడిపోయిన ముఖంతో ఏదో మహాభారంతో కృంగి పోతున్న మనిషిలా ఉంది. అతను దగ్గరకు వెళ్ళి కూర్చు న్నాడు. అతన్ని చూడగానే ఆమె ముఖం వికసించింది. ఎన్నో అతనితో మాట్లాడాలని, చెప్పుకోవాలని తపన పడుతూన్నట్లు ఆవేశ పడింది. పిల్లలు అల్లరిచేస్తూ ఆమెను మాట్లాడనియ్య లేదు. ఒకటి రెండు కుశల ప్రశ్నలడిగి అతను మళ్ళా వస్తానని వెళ్ళిపోయాడు.

తన గదిలోకి వెళ్ళగానే మాధవుడు వచ్చి అడిగాడు: "ప్రొద్దున్నించి భోజనానికైనా రాలేదు. ఇప్పుడైనా రారండి. వడ్డిస్తాను" అని.

అతనికి ఏమీ తినాలనిపించలేదు, విపరీతమైన అలసటగా ఉంది. స్నానం చేశాక మాధవుడు పాలైనా తాగమని తెచ్చిపెట్టాడు. అవి త్రాగి పడుకున్నాడు. అప్పటికి రాత్రి పదిగంటలైంది. నిద్ర రాలేదు. మళ్ళా మనస్సులో ఏదో దిగులనిపించింది. మళ్ళా మరొకసారి "అబ్బ, ఇవ్వాళ మనస్సెందుకు బాగులేదో" అనుకున్నాడు.

ప్రొద్దుటి నుంచి జరిగినవన్నీ ఒక్కసారిగా గిరగిరా కళ్ళల్లో మెదలినవి. సుశీల కళ్ళు, శ్యామల, ఆమె చెల్లెళ్ళు, సముద్రపొద్దు, క్షణకాలం ప్రేమతో చుట్టుకున్న కుక్కపిల్ల, సరళ కన్నీళ్ళు, తన వాగ్దానం, సరస్వతి వాడిన ముఖం, ఆమె పిల్లల అల్లరి అన్నీ ఏవో ఒకటొకటిగా తల్లో తిరిగినాయి.

విచిత్రమైన ప్రపంచం! అతనికి ప్రపంచంలో అందరి మీద ఒక్కసారి జాలి ముంచుకు వచ్చింది. అందరి హృదయాలు ఏవేవో కల్పనలతో, ఆశలతో ఎప్పుడూ ఊగిపోతూనే ఉంటాయికాబోలు, దీనికి అంతం ఏమిటి! రోజులు గడిచేకొద్ది మనస్సు జడత్వం పొందుతుంది కాబోలు !

అయిదారేండ్లలో సరస్వతి ఎంత మారిపోయింది! ఆ ముఖంలో ఉత్సాహమే కనపడలేదు! ఇంకో అయిదారేండ్లలో

సరళ కూడా ఇలాగే అయిపోతుంది. తనూ? తను కూడా ఇలాగే మారిపోతాడా?

ఇప్పుడు తను సరళకు మాట ఇచ్చాడు. పెళ్ళి చేసుకోక తప్పదు. ఉద్యోగమూ చెయ్యక తప్పదు. ఇంక తన జీవితం అందరి జీవితాల్లాగే క్రమబద్ధమౌతుంది. మెల్లమెల్లగా సుశీల జ్ఞాపకం కూడా నశించిపోతుంది. రోజులు గడిచేకొద్దీ తన ఆలోచనలూ, ఊహలూ అన్నీ రూపుమార్చుకొంటాయి. జరిగిన విషయాలన్నీ ఎక్కడో, ఎప్పుడో ఏ జన్మలోనో, ఎవరికో జరిగినవిగా వింతగా తోస్తాయి, ఇప్పటి తన ఊహలూ, ఆలోచనలూ ఇంకొన్నాళ్ళకి జ్ఞాపకం కూడా ఉండవు కాబోలు!

ఎప్పుడో చదివిన ఒక ఫ్రెంచి రచయిత వాక్యాలు గుర్తుకు వచ్చాయి;

"జీవించడంకంటె, జీవితాన్ని గురించి కలలుకంటూ కల్పనలు చేయడం మధురంగా ఉంటుంది. జీవితం ఒక అందని ప్రేయసి లాంటిది. మనం ఆమెను గురించి కలలుకంటూ కల్పన చేస్తూ ఉంటాము. ఈ కల్పన ఆధారంగా ఆమెను ప్రేమిస్తాం. ఈ కలలు నిజం చేసుకోవాలని ఎప్పుడూ ప్రయత్నించకూడదు. అలా అయితే అసలు ఈ కలలే నశించిపోతాయి. క్రమక్రమంగా మనకు తెలియకుండానే మనస్సు జడత్వం పొందుతుంది. పదేళ్ళ తరువాత ఇప్పటి మన కల్పనలూ, ఆశలూ ఎటువంటివో మనం గుర్తు తెచ్చుకోలేము. తెచ్చుకున్నా అప్పుడు అవి మనవేనని అనుకోలేము. ఆ నిమిషానికి ఎదురుగుండా కనిపించిన గడ్డి మేస్తూ సంతృప్తి పొందుతూ, అదే జీవిత

మనుకునే జంతువులాగ, మనమూ అన్నీ మరచిపోయి జీవన యాత్ర సాగిస్తాం. ఎవరు చెప్పగలరు? బహుశా మృత్యువు తోనే మనకు చైతన్యవంతమైన అనంతమైన జీవితం ప్రారంభ మౌతుందేమో."

అమ్మో! సౌందర్యాన్ని ఔన్నత్యాన్ని అందుకోవాలనే ఈ ప్రయత్నం ఎప్పుడూ అసఫలంగానే ఉండిపోతుందికాబోలు! మనం ఎవరినీ శాశ్వతంగా జ్ఞాపకం కూడా ఉంచుకోలేము. ఈ మనస్సుకు నిలుకడలేదు. మళ్లామళ్ళా భ్రాంతికి లోనవు తూనే ఉంటుంది. ఏదో మరచక్రంలో తగుల్కొన్న వస్తువు లాగ ఎప్పుడూ గిరగిరాతిరుగుతూనే ఉంటుంది, దీనికి విశ్రాంతి, విరామము, విముక్తి ఎప్పుడూ లేవు.

మనస్సు బాగున్నా, బాగుండక పోయినా రోజు గడచి పోతుంది. అలాగే జీవితం గడిచిపోతుంది. కాలచక్రం ఆగదు. జీవధార ప్రవహించకుండా ఉండదు.

ఒక్కరోజులో, ఒక్క ఏడాదిలో ఒకే వ్యక్తి ఎన్నో జన్మలు దాటి ఎందరో వ్యక్తులుగా మారినట్టుంటుంది ఒక్కొ క్కసారి.

మనస్సు బాగుండనిది ఎప్పుడు? ఎవరికి?

అంతులేని ఆలోచనలో అతనికి ఏ నిమిషానో నిద్ర పట్టింది.